లెక్కింపు హాల్‌ను పరిశీలిస్తున్న డీఈవో, ఎన్నికల పరిశీలకుడు, లెక్కింపు పరిశీలకురాలు

# సెగ్మెంట్ల వారీగా లెక్కింపు సిబ్బంది

- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయింపు

కలెక్టరేట్, జూన్ 3 : నేడు జరిగే ఓట్ల లెక్కింపు కోసం పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందిని కేటాయించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి రెండో ర్యాండమైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లెక్కింపు సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. లెక్కింపు సందర్భంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సాధారణ ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా, లెక్కింపు పరిశీలకురాలు నజ్మా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

***లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు***

ఓట్ల లెక్కింపు కోసం అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ లోక్‌సభ ఓట్ల లెక్కింపు చేపట్టనున్న ఎస్సారార్ కళాశాలలో చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం ఆమె పరిశీలించారు. కౌంటింగ్ హాళ్లను సాధారణ ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా, లెక్కింపు పరిశీలకురాలు నజ్మాతో కలిసి పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. లెక్కింపు హాళ్లలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు, బారికేడ్లు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు, గుర్తింపు కార్డులున్న వారిని మాత్రమే లెక్కింపు హాళ్లలోకి అనుమతించనున్నట్లు స్పష్టం చేశారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూములో నుంచి లెక్కింపు హాళ్లలోకి సిబ్బంది జాగ్రత్తగా తరలించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్, ఏసీపీ నరేందర్ పాల్గొన్నారు.

# పనులను త్వరగా పూర్తి చేయాలి



రాగంపేట పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్ రావు

చొప్పదండి, జూన్ 3: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు ఆదేశించారు. సోమవారం మండలంలోని కొలిమికుంట, పెద్దకుర్మపల్లి, కాట్నపల్లి అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. ఆయా చోట్ల జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో అంబటి వేణు కుమార్, రుక్మాపూర్, రాగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాఘు కిశోర్, లచ్చయ్య, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All
CHANGE OF NAME
★ Pakala Sathaiah S/o Narsaiah H.No. 8-89, V/o Rechapally Sarangapur mandal Jagitial Dist. My spouse Name Venkata Lakshmi (Old Name) my spouse Name changed as Pakala Venkavva W/o Sathaiah.
NTK-311490
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## వడదెబ్బతో వృద్ధుడి మృతి

గంగాధర, జూన్ 3 : మండలంలోని తాడిజెర్రి గ్రామానికి చెందిన గుంటుకు మల్లయ్య(68) అనే వృద్ధుడు వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న మల్లయ్యకు రెండు రోజుల క్రితం వడదెబ్బ తగలడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మల్లయ్య మృతి చెందాడు.

## ధ్రువీకరణ పత్రాలు అందించాలి

ఇల్లంతకుంట, జూన్ 3: రహీంఖాన్‌పేట లోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11లోగా తమ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ప్రిన్సిపాల్ మధుకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేశామని తెలిపారు. టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎస్సెస్సీ వెబ్ మెమోతో ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## పెద్ద జయంత్యుత్సవాల ఆదాయం రూ.1.51 కోట్లు

మల్యాల, జూన్ 3: కొండగట్టు దేవస్థానంలో మే 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగిన హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలకు రూ. 1.51 కోట్ల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. కేశఖండనం టికెట్ల ద్వారా రూ. 9,76,150, విరమణ టికెట్ల ద్వారా రూ. 31,09,700, ప్రత్యేక దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ. 21,77,500, లడ్డూ ప్రసాదాలకు రూ. 76,42,000, పులిహోర ప్రసాదం ద్వారా రూ.12,33,140 మొత్తంగా రూ. 1,51,38,490 వివిధ టికెట్ల విక్రయాల ద్వారా వచ్చినట్లు తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

రాంనగర్, జూన్ 3: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆసిఫ్ నగర్‌కు చెందిన రంగు సురేశ్ ఐదు కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. అతడిని విచారించగా, వారం క్రితం ఒడిశా రాష్ట్రంలోని మోటో గ్రామంలో ఫయాజ్ అనే వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినట్లు తెలిపాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ సునీల్‌రావు

- కరెంట్ కోతలు, నీళ్లు లేక తల్లడిల్లుతున్నారు
- మళ్లీ కేసీఆర్ పాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారు
- ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ రూరల్, జూన్ 3: కేసీఆర్ పదేండ్ల పాలనలో పాడి పంటలతో ఎంతో సంతోషంగా ఉన్న రైతులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు నెలల పాలనలో ఆగమయ్యారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కరెంట్ కోతలు, నీళ్లు లేక ప్రజలు, రైతులు తల్లడిల్లుతున్నారని తెలిపారు. మళ్లీ కేసీఆర్ పాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, నయవంచన చేసే రేవంత్ రెడ్డి మాటలపై ఆరునెలల్లోనే ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు. విద్యావంతులు కేసీఆర్ పాలనను ఆకాంక్షిస్తున్నారని, సీఎం సొంత నియోజకవర్గంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ , రేవంత్‌రెడ్డి సీమాంధ్రుల కనుసన్నల్లో పాలన చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను, తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. అయితే తెలంగాణ చరిత్ర గొప్పదని, తెలంగాణ అమరుల త్యాగాలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో పల్లెల నుంచి పట్టణాల వరకు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. రూ.వేల కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో కరీంనగర్, పరిసరాల గ్రామాలు ప్రగతి బాట పట్టాయని తెలిపారు. రాష్ట్రంలో అధికార పార్టీకి బలమైన ప్రతిపక్షంగా బీఆర్ఎస్‌ను ప్రజలు ఆశీర్వదించి నిలబెట్టారని పేర్కొన్నారు. ప్రజల కోసం మరో ఉద్యమానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రగతిపై 500 పేజీల పుస్తకం రాసినా సరిపోదన్నారు. 60 ఏండ్లలో జరుగని అభివృద్ధిని, కేవలం పదేళ్లలో చేసి చూపారని కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర విధివిధానాలను మార్చే ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు. సర్కారుకు సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, తోట తిరుపతి, బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, పార్టీ మండలాధ్యక్షుడు, గ్రామాధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

***ప్రభుత్వ ప్రధాన దవాఖానలో పండ్ల పంపిణీ***

కార్పొరేషన్, జూన్ 3 : తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొని పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో ప్రభుత్వ దవాఖానలు అభివృద్ధి చెందాయన్నారు. అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించేలా సౌకర్యాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, జూన్ 3 : గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రమీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సౌకర్యాలతో ఎంపీసీ, బైపీసీ. సీఈసీ, హెచ్ఈసీ ఇంగ్లిష్, తెలుగు మీడియంలో విద్యాబోధన చేస్తున్నామని, ఉచితంగా ఎంసెట్, నీట్ కోచింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. కళాశాలలో చేరిన బాలికలకు మల్బార్ గోల్డ్ ఆధ్వర్యంలో రూ.10 వేల స్కాలర్‌షిప్, అత్యధిక మార్కులు సాధించే విద్యార్థికి ఎల్కపెల్లి లింగారెడ్డి జ్ఞాపకార్థం రూ.10 వేల ప్రోత్సాహకం ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న శ్రీనివాస ఉన్నత పాఠశాల 2002-2003 బ్యాచ్ విద్యార్థులు

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తెలంగాణచౌక్, జూన్ 3: నగరంలోని శ్రీనివాస ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (2002-2003 పదో తరగతి బ్యాచ్) సోమవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయుడు రాజమహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, భగవాన్‌దాసు, విశ్వనాథం, వేణుమూర్తి, మారుతిమోహన్‌రావు, రామనంద్, రేణుక, పూర్వ విద్యార్థులు మునీందర్, రాధిక, చందన, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

దాసరి విశ్వహిత కనక విశిష్ఠ రఘునందన్ ఆదిచర్ల సత్యవర్ధన్

కమాన్‌చౌరస్తా, జూన్ 3 : తెలంగాణ పాలిసెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. అల్ఫోర్స్ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన దాసరి విశ్వహిత రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. జిల్లా కేంద్రానికి చెందిన కనక విశిష్ఠ రఘునందన్ రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు, జిల్లాలో రెండో ర్యాంకు సొంతం చేసుకున్నది. విశిష్ఠ ఫిట్జ్‌లో పదో తరగతి పూర్తి చేసి, ఇంటర్ చదువుతున్నది. అలాగే, అలాగే సిద్ధార్థ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ఆదిచర్ల సత్యవర్ధన్ రాష్ట్ర స్థాయిలో 46వ ర్యాంకు, జిల్లాలో మూడో ర్యాంకు సాధించాడు.

## బావిలో పడిన శునకం.. కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

దుర్గేడ్‌లో బావిలో పడిన కుక్కను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ రూరల్, జూన్ 3: దుర్గేడ్ గ్రామంలో ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన వీధి కుక్కను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసి కాపాడారు. నాలుగు రోజుల క్రితం బావిలో పడిన శునకం.. ఆహారం, నీరు లేకపోవడంతో ఆకలితో అలమటిస్తూ అరుస్తుండగా స్థానికులు గమనించి, స్టే ఎనిమల్ ఫౌండేషన్ ప్రతినిధి గౌతం, శ్రీలక్ష్మి జంతు సంరక్షణ ప్రతినిధి ఆసిరి సుమన్‌కు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది, నిచ్చెన ద్వారా బావిలోకి దిగి శునకాన్ని వల సహాయంతో బయటకు తీసుకొచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న శునకాన్ని కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని జంతుప్రేమికులు అభినందించారు.

## 'పోరాటయోధుడు సామల మల్లేశం'

కలెక్టరేట్, జూన్ 3: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన యోధుడు సామల మల్లేశం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కొనియాడారు. సోమవారం సిరిసిల్లలో దివంగత సీపీఐ నాయకుడు సామల మల్లేశం సంతాప సభను సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించగా, కార్యక్రమానికి చాడ వెంకట్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. సామల మల్లేశం చేనేత పరిశ్రమ, పవర్‌లూం కార్మికులు, బీడీ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాట ఉద్యమాలు చేశారన్నారు. ఇక్కడ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నాయకులు గుంటి వేణు, తాండ్ర సదానందం, పంతం రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, నాయకులు నల్ల చంద్రమౌళి, కడారి రాములు, చెన్న విశ్వనాథం, మీసం లక్ష్మి తదితరులు ఉన్నారు.

## అప్పుల భారంతో ఒకరి బలవన్మరణం

వెల్గటూర్, జూన్ 3: ఎండపల్లి మండలంలోని పడకల్‌కు చెందిన వడ్కపురం శ్రీనివాస్ (40) అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేండ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసిన శ్రీనివాస్ మూడేండ్ల క్రితం ఫైనాన్స్‌లో లోన్ తీసుకొని ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అయితే ట్రాక్టర్ సరిగ్గా నడవకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. ఈ విషయమై వారం కిందట భార్య శ్యామల భర్త శ్రీనివాస్‌తో గొడవపెట్టుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ శనివారం ఇంటినుంచి వెళ్లిపోయి, పంట పొలాల మధ్య చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

## ఎల్లమ్మ గుడిలో చోరీ

ఎల్లమ్మగుడిలో పరిశీలిస్తున్న కానిస్టేబుల్, వివరాలు తెలుపుతున్న గీతకార్మికులు

వీణవంక, జూన్ 3: పోతిరెడ్డిపల్లి గ్రామంలోని ఎల్లమ్మగుడిలో అమ్మవారి వెండి ఆభరణాలు, హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోతిరెడ్డిపల్లి గీతకార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా ఎల్లమ్మగుడి నిర్మించి, ప్రారంభోత్సవాన్ని చేసుకున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. అమ్మవారి విగ్రహానికి అలంకరించిన వెండి ఆభరణాలు, హుండీ చోరీ చేశారు. సోమవారం గమనించిన గీతకార్మికులు డయల్ 100కు ఫోన్ చేయగా, స్థానిక పోలీసులు గుడి వద్దకు చేరుకొని పరిశీలించారు. చోరీకి గురైన వెండి ఆభరణాల విలువ సుమారు రూ. 30 వేల వరకు ఉంటుందని గీతకార్మికులు తెలిపారు.

## ప్రమాదవశాత్తు ఈటీపీ ట్యాంకులో పడి ఒకరి మృతి

జమ్మికుంట, జూన్ 3: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ సమీపంలోని ఎస్ఆర్‌కే డెయిరీలో టెక్నికల్ ఆఫీసర్ ఎస్‌కే ముజీజ్(44) ప్రమాదవశాత్తు ఈటీపీ ట్యాంకులో జారిపడి మృతి చెందాడు. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందిగామకు చెందిన ముజీజ్ వెంకటేశ్వర్లపల్లి ఎస్ఆర్‌కే డెయిరీలో టెక్నికల్ ఆఫీసర్‌గా నాలుగు నెలల నుంచి పనిచేస్తున్నాడు. సోమవారం విధుల్లో భాగంగా ఈటీపీ ట్యాంకును చెక్ చేసే సమయంలో కాలు జారి ట్యాంక్‌లో పడిపోయాడు. గమనించిన సిబ్బంది జీఎం మధుకు సమాచారం అందించారు. ట్యాంక్‌లో పడిపోయిన ముజీజ్‌ను బయటకు తీసి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే ముజీజ్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి భార్య షేక్ కరీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

## చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

గాంధీచౌక్, జూన్ 3: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ కావేటి సృజన సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఈ ఏడాది ఏప్రిల్ 6న సిరిసిల్లకు చెందిన వీరబత్తిని మహేశ్, వాసాల శివకుమార్, మీసాల బాల్‌రాజు తమ ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు కేసులను పోలీసులు దర్యాప్తు చేసి వాహనాలను దొంగిలించిన బోధన్‌కు చెందిన మలావత్ తులసీరామ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ఎస్ఐ శ్రీనివాస్‌రావు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## 'చార్‌ధామ్ యాత్ర-నా అనుభవాలు' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ సంస్కృత పండితుడు, అష్టావధాని శ్రీహరిశర్మ

వేములవాడ టౌన్, జూన్ 3: పట్టణానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నూగూరి ప్రతాప్ రచించిన 'చార్‌ధామ్ యాత్ర- నా అనుభవాలు' పుస్తకాన్ని సోమవారం ఆయన స్వగృహంలో ప్రముఖ సంస్కృత పండితుడు, అష్టావధాని, మహామహోపాధ్యాయ బిరుదు గ్రహీత తిగుళ్ల శ్రీహరిశర్మ ఆవిష్కరించారు. ఇక్కడ సీనియర్ న్యాయవాది నాగుల సత్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తడగొండ సత్తయ్య, నూగూరి అన్నయ్య, రాజన్న ఆలయ విశ్రాంత పర్యవేక్షకుడు నూగూరి ప్రకాశం, శ్రీనివాస్, నరేందర్ తదితరులు ఉన్నారు.

## సివిల్స్ ర్యాంకర్‌కు సీఎం అభినందన

సాయికిరణ్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి

రామడుగు, జూన్ 3 (చొప్పదండి): సివిల్స్-2023లో ఆల్‌ఇండియా 27వ ర్యాంకు సాధించిన రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయి కిరణ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం సాయికిరణ్, అతడి కుటుంబసభ్యులతో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి కిరణ్‌ను సీఎం శాలువా కప్పి సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

## రాష్ట్ర అభివృద్ధిలో హరీశ్‌రావు కృషి గొప్పది

రామకృష్ణాపూర్‌లో ఉపాధిహామీ కూలీలకు పండ్లు పంపిణీ చేస్తున్న హరీశ్‌వర్మ

వీణవంక, జూన్ 3: తెలంగాణ ఉద్యమంలో, అనంతరం రాష్ట్ర అభివృద్ధి సాధనలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కృషి గొప్పదని టీహెచ్ఆర్ టీం వ్యవస్థాపకుడు అప్పని హరీశ్‌వర్మ పేర్కొన్నారు. సోమవారం రామకృష్ణాపూర్ గ్రామంలో హరీశ్‌రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉపాధిహామీ కూలీలకు పండ్లు పంపిణీ చేశారు. హరీశ్‌రావు రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని హరీశ్‌వర్మ ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు అప్పని రాజయ్య, యార సుమన్, రాజయ్య, తిరుపతి, గడ్డం అజయ్, శ్రీధర్, జతిన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పంపిణీ పథకంపై ప్రభుత్వం హామీ ఇవ్వాలి

తెలంగాణచౌక్, జూన్ 3: గొల్ల, కురుమలకు రెండో విడుత గొర్రెల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. గొల్ల, కురుమల సమస్యలను పరిష్కరించాలని సోమవారం నగరంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా పశువైద్యాధికారి సురేందర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కాల్వ సురేశ్ యాదవ్ మాట్లాడుతూ, రెండో విడుత గొర్రెల పంపిణీ కోసం జిల్లా వ్యాప్తంగా 87,593 మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. 3,414 మంది రూ.43,750 చొప్పున డీడీ తీసి కలెక్టర్ ఖాతాలో జమచేశారని పేర్కొన్నారు. అధికారులు గొర్రెలు, మేకలను పంపిణీ చేయకపోగా, డీడీలను వాపస్ తీసుకోవాలని ఒత్తిడి తీసుకుస్తున్నారని తెలిపారు. గొర్రెలు పంపిణీ చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతామని ఆశించిన గొల్ల, కురుమలకు నిరాశ